అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలి



రామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్ : అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని మియాపూర్ డివిజన్ పరిధిలోని జేపీఎన్ నగర్‌లో ఆయన విగ్రహానికి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆయన అడుగుజాడలలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అన్వర్ షరీఫ్, పూర్ణచంద్‌రావు, చంద్రికప్రసాద్, ఉమ, మల్లేష్, నర్సింలు,గంగాధర్, రమాదేవి, రంగరాజు, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, దుర్గరాజు, కృష్ణంరాజు, సత్యనారాయణ, శివ తదితరులున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నివాళి

పటాన్‌చెరు టౌన్: జాతిని జాగృతం చేసిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహానికి కార్పొరేటర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అఫ్జల్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన చట్టాల గురించి తెలుసుకోవాలి

జిల్లా సీనియర్ జడ్జి రమేశ్



సదస్సులో మాట్లాడుతున్న రమేశ్

జిన్నారం (పటాన్‌చెరు): నూతన చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని జిల్లా సీనియర్ జడ్జి రమేశ్ అన్నారు. జిన్నారంలోని గిరిజన గురుకుల కాలేజీలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా బేటీ బచావ్-బేటీ పఢావ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధికారిత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ పల్లవి, ఎస్‌ఐ విజయారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకర క్రషర్లపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు



పీసీబీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): కంకర క్రషర్‌లతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని మాదారం మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. క్రషర్‌లను గ్రామం నుంచి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలంటూ గురువారం పీసీబీ అధికారులకు మాదారం గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ మాట్లాడుతూ అక్రమ బ్లాస్టింగ్‌లతో కాలుష్యం పెరిగిపోతోందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు విజయ్, గణేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఐఐటి బాసరకు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం పరిధి వెలిమెల తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన మానస, తేజశ్వినిలు ఐఐటి బాసరలో బీటెక్ ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థులు అత్యధిక జీపీఏ 9.8/10 తో రామచంద్రాపురం మండలంలో అగ్రస్థానంలో నిలిచారని పేర్కొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో జరుగుతున్న యూజీడీ నిర్మాణ పనులను గురువారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాని కాంట్రాక్టర్‌లకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షులు హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు మండల ప్రత్యేక అధికారిగా దేవుజ



పటాన్‌చెరు: పటాన్‌చెరు మండల ప్రత్యేక అధికారిగా సంగారెడ్డి జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి దేవుజ బాధ్యతలు స్వీకరించారు.గురువారం పటాన్‌చెరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీడీఓ యాదగిరి, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, కార్యాలయ సిబ్బంది దేవుజాకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు మండల, గ్రామపంచాయతీ కార్యదర్శులు కవిత, రాజేందర్, ప్రవీణ్, రిజ్వాన్, దయానంద్, పద్మ ,లక్ష్మణాచారి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శ్రీధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.







పార్కులో ఆకట్టుకుంటున్న రాతి శిల్పాలు



కాంబోడియా త్రీ ఫేసెస్



శ్రామిక మహిళ శిల్పం

ప్రకృతి రాగం.. ఆరోగ్య యోగం

☆ శిల్పారామంలో ఆకట్టుకుంటున్న పార్కు ☆ విదేశీ మీడియా ప్రతినిధుల కితాబు

మాదాపూర్:

ప్రకృతి అందాలను ఆస్వాదించే వారిని ప్రకృతి రాగ పార్క్ ఆకట్టుకుంటుంది.మాదాపూర్‌లోని శిల్పారామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రకృతి రాగ పార్క్‌లోకి సందర్శకులకు ప్రవేశం కల్పించారు. సహజ సిద్ధంగా ఏర్పడిన వివిధ రకాల ఆకృతులను పచ్చని వాతావరణంలో ఏర్పాటు చేశారు. చిలుక, సింహం, తల్లి, వివిధ రకాల దేవతామూర్తుల విగ్రహాలు, రాయల్ టైగర్, శ్రామిక మహిళ తదితర ఆకృతులు ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి భవన్ శాంతినికేతన్‌కు చెందిన సుబ్రతా బసు ఈ సహజసిద్ధ శిల్పాలు, ప్రకృతి రమణీయ ఆకృతులు తయారు చేశారు. పార్కు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. శిల్పారామం ప్రవేశ టికెట్ తీసుకున్న వారందరు ఉచితంగా సందర్శించవచ్చు.

- ఇటీవల 21 మంది విదేశీ మీడియా ప్రతినిధులు శిల్పారామం అందాలను తిలకించి ప్రశంసలను కురిపించారు.
- ఈస్ట్ ఇండియా, యూరేసియా, మిడిల్ ఈస్ట్ తదితర దేశాలకు చెందిన మీడియా ప్రతినిధులు ప్రకృతి రాగ పార్కు చాలా బాగుందని కొనియాడారు.

విలేజ్ మ్యూజియం గురించి తెలియాలి



శిల్పారామానికి మొదటిసారి వచ్చాను. చాలా బాగుంది. పల్లె వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నట్లు ఉంది. విలేజ్ మ్యూజియంలో పల్లెటూరిలో జరిగే సంత, కుల వృత్తులు తదితర అంశాలను చిన్నారులకు తప్పనిసరిగా చూపించాలి. సేద తీరేందుకు శిల్పారామం అద్భుతం.

–బాబు, విజయవాడ

అద్భుతంగా ఉంది



సందేశాత్మకంగా ఉన్నాయి. ఒక్కోఆకృతి ఒక్కో సందేశాన్ని ఇస్తుంది. కుటుంబంతో కలసి వచ్చి సరదాగా వచ్చి సేద తీరొచ్చు. నేను రెండోసారి వచ్చాను. పార్కును అద్భుతంగా ఏర్పాటు చేశారు.

–వినయ్, సందర్శకుడు, హైదరాబాద్





విభిన్న ఆకృతిలో ఏర్పాటు చేసిన బెంచీ



సెల్ఫీలు దిగుతున్న సందర్శకులు

కేవీ బాలికల కబడ్డీ విజేత హెచ్‌సీయూ విద్యాలయ



విజేతలతో ప్రిన్సిపల్ ప్రియారాణి, పీఈటీ విజయభాస్కర్‌రెడ్డి

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయ క్లస్టర్ స్థాయి బాలికల కబడ్డీ అండర్-17 విజేతగా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ కేంద్రీయ విద్యాలయ బాలికల జట్టు నిలిచింది. క్లస్టర్ స్థాయి కబడ్డీ అండర్-17 పోటీలను గోల్కొండ కేంద్రీయ విద్యాలయ-1 ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో గోల్కొండ-1, గోల్కొండ-2, కేవీఖమ్మం, కేవీ నల్గొండ, కేవీహెచ్‌సీయూ జట్లు పోటీ పడ్డాయి. ఇందులో హెచ్‌సీయూ జట్టు విజేతగా నిలిచింది. దీంతో గురువారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ ప్రియారాణి, పీఈటీ విజయభాస్కర్‌రెడ్డి బాలికల జట్టును అభినందించారు. మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రియారాణి మాట్లాడుతూ చదువు తోపాటు క్రీడలలో కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జెడ్సీ ఉపేందర్‌రెడ్డి



గచ్చిబౌలి: వర్షాకాలం ప్రజలు ఇబ్బందిపడకుండా చూడాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జోనల్ కమిషనర్‌కు సూచించారు. గురువారం జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్కను అందించారు. అనంతరం అభివృద్ధి, పెండింగ్ పనులు, వర్షాకాలంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండడంతో గుంతలు పడుతున్నాయని ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలని కోరగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా చర్యలు



గచ్చిబౌలిలోని బర్లకుంటను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: చెరువులలో మురుగునీరు చేరకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జోనల్ పరిధిలోని పలు చెరువులను ఆయన పరిశీలించారు. చెరువుల రక్షణ, పర్యవేక్షణ చేసేందుకు అధికారులను నియమించామని తెలిపారు. చెరువులు కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. చెరువులపై భాగంలో ఉన్న కాలనీల నుంచి వచ్చే మురుగు నీటికి డైవర్షన్ ఛానల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. చెరువులు, కుంటల పరిసరాలలో నివసించే ప్రజలు వ్యర్థాలను వేయవద్దని కోరారు. నిర్మాణ వ్యర్థాలు చెరువుల పరిసరాలలో వేయకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని ఆదేశించారు. రహదారులపై ఉన్న పాట్‌హోల్స్‌ను పూడ్చి ట్రాఫిక్ అంతరాయం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ నళిని, వైద్యాధికారి డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ



పురుషోత్తంను అభినందిస్తున్న తెలుగు ఆచార్యులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి కామెర పురుషోత్తంకు పీహెచ్‌డీని ప్రకటించారు. మంచిర్యాల జిల్లా ములకలపేట గ్రామానికి చెందిన కామెర పురుషోత్తం 'తెలంగాణలో భావ కవిత్వం వస్తు శిల్పం' అనే అంశంపై తెలుగు విభాగంలో పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. తెలుగు విభాగం ఆచార్యుడు డాక్టర్ భూక్యా తిరుపతి పర్యవేక్షణలో పురుషోత్తం పీహెచ్‌డీ పూర్తి చేశారు. శుక్రవారం హెచ్‌సీయూలోని తెలుగు విభాగంలో తెలుగు ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు, పిల్లలమర్రి రాములు, గోనానాయక్, పమ్మి పవన్‌కుమార్ ఇతర ఆచార్యులు అభినందించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 50, పచ్చిమిర్చి 90, బెండ 50, కాకర 60, దొండ 30, దోస 40, ఆలు 45, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్ 130, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 90, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 280.

పరామర్శ



చొప్పదండి ఎమ్మెల్యే సత్యంను పరామర్శించిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఎమ్మెల్యే గాంధీ పరామర్శించారు. గురువారం అల్వాల్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి మృతి చెందిన విషయం తెలిసిందే. అంతకుముందు రూపాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చల్లా శోభన్ పాల్గొన్నారు.

ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే.. వారు కంపెనీని జాగ్రత్తగా చూసుకుంటారు

టైటాన్ వాచెస్ అండ్ వేరబుల్ డివైసెస్ సీఈఓ సువర్ణమిత్ర



టీహబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ సువర్ణమిత్ర, ప్రియాగజ్దర్ తదితరులు

రాయదుర్గం: మీరు ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే వారు వ్యాపారం, కంపెనీని బాగా చూస్తారని టైటాన్ వాచెస్ అండ్ వేరబుల్ డివైసెస్ సీఈఓ సువర్ణమిత్ర అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్‌ఎల్‌ఓ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'టాటా లెగసీ-లివింగ్ వాల్యూస్' అనే అంశంపై గురువారం సమావేశం జరిగింది. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియాగజ్దర్‌తో ఆమె ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణమిత్ర పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. వ్యక్తిగతంగా కంటే మహిళలు కలిసి, సామూహికంగా జట్టుగా ఉంటే అందంగా, బలంగా ఉంటారన్నారు, చేతి గడియారాలు ఎప్పటికీ చెలామణిలో నుంచి పోవని స్పష్టం చేశారు. ప్రస్తుత మొబైల్ ఫోన్ల యుగంలోనూ చేతి గడియారాలు పాతబడిపోలేదన్నారు.ప్రియాగజ్దర్ మాట్లాడుతూ వ్యక్తుల కేంద్రీకృత విలువలు, మానవీయ దృక్పథం దాని జీవనాధారమని చెప్పారు.

హుక్కా ఫ్లేవర్ల విక్రయం..కేసు నమోదు

మియాపూర్ : హుక్కా సెంటర్‌లకు సంబంధించి నిషేధిత ఫ్లేవర్‌లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని హాఫీజ్‌పేట్‌లో హుక్కా ఫ్లేవర్‌లను విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు మియాపూర్ పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. షేక్ మహ్మద్ జహేద్ (25), జిబ్రాన్(27)లు హుక్కా సంబంధించిన నిషేధిత ఫ్లేవర్‌లను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. షేక్ మహ్మద్ జహేద్‌ను అరెస్టు చేయగా అతని యజమాని జిబ్రాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అక్కడ ఉన్న సుమారు 40వేల సరుకును స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సాయంత్రం అయితే.. దోమల బాధ

- నివారణ చర్యలు శూన్యం
- చెరువుల్లో అల్లుకున్న గుర్రపు డెక్క
- పట్టించుకోని అధికారులు



గుర్రపుడెక్కతో నిండిన కాముని చెరువు

మూసాపేట: మూసాపేట అంటేనే మినీ ఇండియా. ఇక్కడ అన్ని రాష్ట్రాల ప్రజలు నివసిస్తుంటారు. పైగా కూలీలు, కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతం. దోమల స్వైర విహారంతో ఈ ఏరియా ఇప్పుడు వణికిపోతోంది. సాయంత్రం 6 దాటిందంటే తలుపులు మూసుకుని దోమల బ్యాట్లతో కూర్చుంటున్నారు. ఎక్కడ చూసినా దోమల చర్చ. మూసాపేటతో పాటు సమీప ప్రాంతవాసులు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మూసాపేట, యాదవబస్తీ, జనతానగర్, ఆంజనేయనగర్, పవర్‌నగర్, ప్రగతినగర్, హబీబ్‌నగర్, భరత్ నగర్, ఖైత్లాపూర్, శ్రీరామ్‌నగర్‌లతో పాటు రెయిన్ బో విస్టాస్, మైస్టిక్ హిల్స్ ప్రజలు చాలా ఇబ్బందులుపడుతున్నారు.

అసలు సమస్య..

ఈ ప్రాంతంలో చెరువులు, నాలాలు ఎక్కువగా ఉన్నాయి. చెరువులు, నాలాల సమీపంలో ఉన్న ప్రజలు చీకటి పడితే ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. కనీసం కిటికీలు, తలుపులు తెరిచే సాహసం కూడా చేయడం లేదంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఐడీఎల్ రంగధాముని చెరువు, కాముని చెరువు, మైసమ్మ చెరువుల అలుగుల నుంచి హుస్సేన్‌సాగర్‌కు వెళ్లే నాలాలు ఎక్కువ పొడవు ఉండడంతో బాటు ఈ ప్రాంతం ముందు, వెనుక రెండు వైపుల నాలా ప్రవహిస్తుంది. ఇక కాముని చెరువులో గుర్రపుడెక్క అల్లుకుపోయి పచ్చని మైదానంలా కనిపిస్తుంది. మిగతా చెరువుల్లో కూడా ఈ సమస్య ఉంది. దీంతో దోమలు ప్రబలాయి.

అధికారులు స్పందించాలి

రెయిన్ బో విస్టాస్‌వాసుల కష్టాలు వర్ణణాతీతం. కిటికీలు, తలుపులకు దోమ తెరలు బిగించుకున్నా ఇళ్లలోకి వస్తున్నాయి. కారు ఎక్కే సమయంలో డోరు తీసి, వేసే సమయంలో కారులోకి చేరిపోతున్నాయి. ఈ క్రమంలో చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గత 10 రోజుల కిందట బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే అధికారులు మున్సిపల్ కార్యాలయానికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో ధర్నా చేసి ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు అంటున్నారు.



కూరగాయల మార్కెట్‌లో దోమలు రాకుండా పొగ

ఫాగింగ్ జాడ లేదు

దోమల నివారణకు కనీసం చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో గుర్రపుడెక్కను తొలగించడం లేదని, కనీసం కాలనీల్లో ఫాగింగ్ కూడా చేయడం లేదని వాపోతున్నారు.